TELTEL/2023/88710

# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

www.telanganamuchatlu.in

వరంగల్ సంపుటి : 2 సంచిక : 21 మంగళవారం 1 - 10 - 2024 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in




## అక్టోబర్ 9న

# డీఎస్సీ నియామక పత్రాలు

- 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చాం
- డిఎస్సీ ఫలితాలు విడుదల చేసిన సిఎం రేవంత్ రెడ్డి

2 లో






## శని,ఆదివారాల్లోనే కూల్చివేతల

# మతలబు ఏంటి

- కూల్చివేతలకు ముందు ఓనర్లకు సమయం ఇవ్వరా
- చట్టప్రకారం నడుచుకోక పోతే హైడ్రాపైనే స్టే విధిస్తాం
- హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం
- వచ్చేనెల 15 వరకు విచారణ వాయిదా



హైదరాబాద్, (సెప్టెంబర్ 30) : హైడ్రా తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో కూల్చివేతలపై పలువురు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై సోమవారం విచారణ జరిగింది. విచారణకు హైడ్రా కమిషనర్ రంగానథ్ వర్చువల్‌గా, అమీన్‌పూర్ తహసీల్దార్

2 లో

## కాంగ్రెస్ అధ్యక్షుడిపై

# అమిత్ షా నిప్పులు



హైదరాబాద్ (సెప్టెంబర్ 30) : జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ, కాంగ్రెస్ అగ్ర నేతల మధ్య డైలాగ్ వార్ తీవ్రస్థాయికి చేరింది. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన కామెంట్స్ తీవ్ర కలకలం రేపాయి. నరేంద్ర మోదీని గద్దె దించేవరకు చనిపోనని ఖర్గే అన్నారు. ఆయన వ్యాఖ్యలను బీజేపీ నేతలు తప్పు పట్టారు.

అమిత్ షా ఏమన్నారంటే..

ఖర్గే వ్యాఖ్యలపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. 'కశ్మీర్‌లో ఖర్గే చేసిన వ్యాఖ్యలు విద్వేషంతో కూడుకున్నవి. ఖర్గే హుందాతనంగా వ్యవహరిస్తారని భావించా. ఆయన ఇతర కాంగ్రెస్ నేతల మాదిరిగా మాట్లాడారు. మోదీపై కాంగ్రెస్ నాయకులకు ఉన్న ద్వేషం ఆ వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోంది. ఆ పార్టీ నేతలకు మోదీ గురించి ఆలోచించడం తప్ప మరో ఆలోచన

2 లో

## రుణమాఫీపై రైతులను

# మోసం చేసిన ప్రభుత్వం

- మండిపడ్డ మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్, (సెప్టెంబర్ 30) : రుణమాఫీ విషయంలో కాంగ్రెస్‌ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చక పోవడం కాంగ్రెస్ వైఫల్యమని అన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 3,79 లక్షల రైతులకు రుణమాఫీ కావాల్సిఉండగా,1.75 లక్షల మంది కి మాత్రమే రైతులకు మాఫీ అయ్యిందన్నారు. ఇంకా 2.04 లక్షల రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో 48 వేల మందికి గాను 32 వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదని వివరించారు.



సంపూర్ణ మాఫీ చేసే వరకూ వదిలేది లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఇంటింటి హెల్త్ ప్రొఫైల్ తయారుచేసి, సీజనల్, ఇతర వ్యాధులు

2 లో

## ఆనంద కన్వెన్షన్‌లో వాటా

# ఆరోపణలు

- కాంగ్రెస్ ఎంపి అనిల్ యాదవ్‌పై హరీష్ మండిపాటు



హైదరాబాద్, (సెప్టెంబర్ 30) : ప్రజా సమస్యలపై పోరాడుతున్న నా పై బురదజల్లే వికృత రాజకీయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపింది. ప్రభుత్వంపై వస్తున్న

2 లో

## వన్ నేషన్ పేరుతో

# ప్రజాస్వామ్యం ఖూనీ

- రాజ్యాంగాన్ని విధ్వంసం చేసే కుట్రలో మోడీ
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపణ

హైదరాబాద్, (సెప్టెంబర్30) :వన్‌నేషన్‌పేరిట హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శలు చేశారు.వన్‌నేషన్ పేరుతో హక్కుల ను కాలరాస్తు ఆర్డినెన్సు లు తీసుకొచ్చే ఆలోచనలను కేంద్రం చేస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. అదే జరిగితే ప్రజాస్వామ్యం ఉండదని హెచ్చరించారు. రాజ్యాం గాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయ త్నాలు తీవ్రంగా చేస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై దేశవ్యాప్తంగా పోరాటానికి సిద్ధమవు తామని వార్నింగ్ ఇచ్చారు. నేపాల్‌లో అధిక వర్షాల

2 లో



## ఆ పాటను ఎవరూ

# మరిచిపోలేరు

## మిథున్‌కు అభినందనలు



అమరావతి, (సెప్టెంబర్ 30) : ప్రముఖ నటులు, రాజ్యసభ సభ్యులు మిథున్ చక్రవర్తికి "దాదాసాహెబ్ ఫాల్కే" పురస్కారం వరించడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేశారు. మిథున్ చక్రవర్తికి దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం ప్రదానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషాన్ని కలిగించిందన్నారు. మిథున్ చక్రవర్తికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. హిందీ, బెంగాలీ చిత్ర పరిశ్రమలో మిథున్ చక్రవర్తి

2 లో

## హర్యానా, జమ్మూకశ్మీర్‌లో

# అధికారం కాంగ్రెస్‌దే



న్యూఢిల్లీ (సెప్టెంబర్ 30) : హర్యానాలోనూ, జమ్మూకశ్మీర్‌లోనూ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ జైరామ్ రమేష్ అన్నారు. ఇటు హర్యానా, అటు జమ్మూ కశ్మీర్‌లో ప్రధాన అంశాలు, పార్టీ వైఖరిని ఏఎన్ఐ కి సోమవారంనాడిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

జై జవాన్, జైకిసాన్, జై పహెల్వాన్

2 లో

# సంపాదకీయం

## మూసీ ప్రజల ఆగ్రహావేశాలను గుర్తించాలి

ఏ ప్రభుత్వం వచ్చినా..తమ ప్రాధాన్యాలనే ఎంచుకుంటున్నారు తప్ప ప్రజల ఎజెండాతో ముందుకు పోవడం లేదు. ప్రజలకు ఏం చేస్తే మేలు కలుగుతుంది..దీర్ఘకాల సమస్యలను ఎలా పరిష్కరించాలి అన్న ధ్యాస కాని, పట్టుదల కానీ ఉండడం లేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలాగే ఉంది. ఒక్కరి నాయకత్వంలో ప్రభుత్వం నడవడం లేదని తేలిపోయింది. మంత్రులు ఎవరికివారు ముందుకు సాగుతు న్నారు. ఎవరికి తోచిన ప్రకటనలు వారు చేస్తున్నారు. సమిష్టిగా నిర్ణయాలు జరగడం లేదన్న ప్రచారం వస్తోంది.రుణమాఫీ విషయంలో స్పష్టత లేకుండా పోయింది. రేషన్ కార్డుల్లో స్పష్టత లేదు. అనర్హుల కార్డులు తొలగించే చర్యలు కానరావడం లేదు. బియ్యం ధరలను పెంచడం లేదు. ఆరోగ్యశ్రీపైనా స్పష్టత లేదు. ఆస్పత్రులను బలోపేతం చేస్తే ఆరోగ్యశ్రీ అవసరం లేకుండా చేయవచ్చు. కానీ అలాంటి కార్యక్రమాలు కదలడం లేదు. అక్రమ నిర్మాణాలపైనా స్పష్టత కానరావడం లేదు. హైడ్రా చేపట్టిన కొన్ని కూల్చివేతలపై ప్రజల్లో స్పందన వచ్చిది. కానీ మూసీ కూల్చివేతల సరికి వచ్చే సరికి వ్యతిరేకత పెరుగుతోంది. మూసీ సుందరీకరణ ఎంత ముఖ్యమో..అక్కడి ప్రజల జీవనం కూడా అంతే ముఖ్యం. వారి అస్తుల రోణ కూడా అంతే ముఖ్యం అని తొలుత గుర్తించాలి. అంటే సామాన్యుల విషయంలో ఆచితూచి వ్యవహరించాల్సి ఉంది. గత 20 ఏళ్లుగా ఆక్రమణలను చూసీచూడనట్లుగా వదిలేసి ఇప్పటికిప్పుడు ప్రజలను రోడ్డున పడేస్తామంటే సరికాదు. బ్యాంక్ లోన్లపై ప్రభుత్వం ఏం చేయబోతుందో చెప్పడం లేదు. జాగాలు అమ్మినవారు ఎవరు..రిజిస్ట్రేషన్ చేసిన వారు..కరెంట్ ఇచ్చిన వారు,నల్లా ఇచ్చిన వారంతా ప్రభుత్వాధికా రులే అని మరవరాదు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఆచరణ సాధ్యమయ్యే పనులే చేపట్టాలి. చెరువులు, జలాశయాల పరిరక్షణ అవసరమే. అంతమాత్రాన ఈ విషయంలో సామాన్యుల జీవితాలు కూడా ముఖ్యమేనని గమనించాలి. మూసీలో ఆక్రమణల పేరిట వేలాది ఇళ్లు కూల్చడం ప్రజల్లో వ్యతిరేకతకు దారితీస్తుంది. హైడ్రా చర్యల వల్ల ఏ పాపం తెలియనివాళ్లు నిరాశ్రయులు అవుతున్నారు. ఫాం హౌజ్‌లను, అతిథి గృహాలను నిబంధనలను అతిక్ర మించి నిర్మిస్తే కూల్చినా ఫర్వాలేదు. అన్ని అనుమతుల తో పేదలు, మధ్యతరగతివారు నిర్మించుకున్న ఇల్లను అదికూడా, దశాబ్దాల క్రితం నిర్మించుకున్న వాటిని తొలగించాలను కోవడం మంచిది కాదు. ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖంను అక్రమించడం పరిపాటిగా మారింది. రాజకీయ పార్టీలు ఇందుకు బాధ్యత వహించాలి. ఈ చర్యలను ఇకముందు ప్రోత్సహిం చకుండా చూసుకోవాలి. మూసీ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలనుకోవడంలో తప్పు లేదు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పం కూడా తప్పుకాదు. అయితే... దశాబ్దాలుగా మూసీలో ఆక్రమణలు జరిగాయి. వేలాది మంది ఇళ్లను నిర్మించుకున్నారు. ఫాం హౌస్‌ల కూల్చివేతలు జరిగినప్పుడు ప్రజల్లో సానుకూల స్పందన ఏర్పడింది. అయితే, హైడ్రా దూకుడు పెంచి సామాన్య ప్రజలు నిర్మించుకున్న ఇళ్లను కూడా కూల్చి వేయడం ప్రారంభించగానే ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. చెరువులు, జలాశయాల ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లను ముందుగా నిర్ణయించకుండా, ఇతర శాఖల అనుమతులతో నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం సమర్థనీయం కాదు. అందుకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. దీనిని విపక్షాలు కూడా అవకాశంగా తీసుకుంటున్నాయి. దీంతో హైడ్రా చర్యలకుమొదటికే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. ప్రజల్లో వ్యతిరేకతకు దారితీస్తున్న చర్యల విషయం లో ఆచితూచి అడుగు వేయాల్సి ఉంటుంది. మరోవైపు మూసీనది ప్రక్షాళన పేరుతో జనావాసాలను ఖాళీ చేయించడంపై కూడా ప్రజల్లో ఆగ్రహావేశాలు నెలకొన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి. క్షేత్రస్థాయిలో విషయాలను తెలుసుకో వాలి. కూల్చివేత లకు తాత్కాలికంగా విరామం ప్రకటించాలి. మొత్తం పరిస్థితిని సమీక్షిం చాలి. రెండు రోజుల క్రితం సంగారెడ్డి వద్ద ఎవరో చెరువులో నాలుగు అంతస్తుల భవనం నిర్మించుకున్నారు. అలాంటి వాటిని కూల్చగానే ప్రజలు హర్షించారు. మూసీ ఆక్రమణలు జరగడానికి గత ప్రభుత్వాలే కారణం. సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. రాజకీయ పార్టీలు ఒత్తిళ్లు తెచ్చి ఆక్రమణలకు పాల్పడి నిర్మించుకున్న కాలనీలకు ఆయా శాఖల అధికారులతో నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను సమకూర్చాయి.

## ఆనంద కన్వెన్షన్‌లో వాటా ఆరోపణలు

వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికి గోబెల్స్ ప్రచారాన్ని ఆశ్రయిస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హిమాయత్ సాగర్‌లో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆనంద కన్వెన్షన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు వాటాలు ఉన్నాయంటూ కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. ఎలాంటి రుజువులు లేకుండా అనిల్ కుమార్ యాదవ్(ఓఖ ఒనితి ఐబీపజీస జజీటజీల) గోబెల్స్ ప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు. తనకు గోల్కొండ, చార్మినార్‌లో కూడా వాటాలు ఉన్నాయని అంటారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. అబద్ధపు ప్రచారాలు చేస్తున్న అనిల్ కుమార్ యాదవ్‌కు లీగల్ నోటీసు పంపుతున్నా.. బహిరంగ క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

## రుణమాఫీపై రైతులను మోసం చేసిన ప్రభుత్వం

ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుందని వేముల గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌కు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని, దీంతో సీజనల్ వ్యాధులు విజృంభించాయన్నారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంల సేవలను కూడా సరిగా వాడుకోలేక పోతోందన్నారు. వెంటనే హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని కా పాడాలని కోరారు. ప్రభుత్వ దవాఖానల్లో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు, చికెన్ గున్యా లాంటి వాటికి మం దులు అందుబాటులో ఉంచాలన్నారు. ఉమ్మడి జిల్లాలో సగం మంది రైతుల రుణాలను కూడా మాఫీ చేయలేదని, రైతు భరోసా కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఎన్నికలప్పుడు అన్ని రకాల వడ్లకు బోనస్ ఇచ్చి కొంటామన్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడేమో సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. మక్క, సోయా, వరి పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వమే ఆయా పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్ణయించిన ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పారని, చెప్పినట్లే బోనస్ చెల్లించి రైతుల పంటలను కొనుగోలు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా మక్కజొన్న సాగుచేశారని, పంట కోతలు కూడా ప్రారంభమ య్యాయన్నారు. కానీ ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. దీంతో దళారులు తక్కువ ధరకే కొంటుండడంతో రైతులు ఎకరాకు రూ.60 వేల దాకా నష్టపోతున్నారన్నారు. మక్కకు కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర రూ.2,225లకు తోడు కాంగ్రెస్ ఇస్తామన్న రూ.500 బోనస్ చెల్లించి రాష్ట్ర ప్రభుత్వమే పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, సోయా పంట మద్దతు ధర రూ.4,892 కాగా, దళారులు రూ.4,300 మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. ప్రైవేట్ వ్యాపారులు సోయా కొనడం ద్వారా రైతులు రూ.500 బోనస్‌తో కలిపి క్వింటాల్‌కు రూ.1100 నష్టపోతున్నారన్నారు. వడ్లకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు సన్నవడ్లకే ఇస్తామని మాట మార్చిందని దుయ్యబట్టారు. రుణమాఫీ విషయంలోనూ అలాగే చేసిందన్నారు.

## శని,ఆదివారాల్లోనే కూల్చివేతల మతలబు ఏంటి

కోర్టులో హాజరై వివరణ ఇచ్చారు. శని, ఆదివారాలు, సూర్యాస్తమయం తర్వాత ఎందుకు కూల్చివేతలు చేపడుతున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం మీరు ఎందుకు పని చేయాలని ప్రశ్నించింది. సెలవుల్లో ఎందుకు నోటీసులు ఇచ్చి, అత్యవసరంగా కూల్చివేస్తున్నారని అడిగింది. శని, ఆదివారాల్లో కూల్చివేయొద్దని గతంలో కోర్టు తీర్పులున్నాయని గుర్తు చేసింది. కోర్టు తీర్పుల విషయం కూడా తెలియదా అని తహసీల్దార్‌ను ప్రశ్నించింది. గతంలో మీరు కూల్చివేసిన కేసుపై స్టే విధించిన విషయం తెలియదా? అని అడిగింది. చట్టప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని తహసీల్దార్‌ను హెచ్చరించింది. రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు చెప్పినంత మాత్రాన అక్రమంగా ముందుకు వెళ్లొద్దు. ఇల్లు కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఏమైనా ఇచ్చారా? ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురి చేస్తారా? అని ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించింది. కూల్చివేతకు యంత్రాలు, సిబ్బందిని కోరడంతో సమకూర్చామని బదులి వ్వగా.. చార్మినార్ కూల్చివేతకు తహసీల్దార్ యంత్రాలు, సిబ్బంది అడిగితే ఇస్తారా? అని హైకోర్టు ప్రశ్నించింది. హైడ్రా ఇదే విధంగా ముందుకు వెళ్తే స్టే ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. ఖాళీ చేయనంత మాత్రాన అత్యవసరంగా కూల్చాల్సిన అవసరం ఏముంది?పొలిటికల్ బాస్‌లను సంతృప్తిపరిచేందుకు, పై అధికారులను మెప్పించేందుకు చట్టవిరుద్ధంగా పని చేయొద్దు. చనిపోయే వ్యక్తిని కూడా చివరి కోరిక అడుగుతారు కదా? ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా? అధికారులు చట్టవ్యతిరేకంగా పనిచేస్తే ఇంటికెళ్తారు.. జాగ్రత్త అంటూ హెచ్చరించింది. మూసీపై కూడా 20 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఇది అరుదైన కేసుగా భావించే అధికారులను విచారణకు పిలిచాం. జీవో ప్రకారం హైడ్రాకు ఎన్నో విధులు ఉన్నాయి. మిగతావి పట్టించుకోకుండా కూల్చివేతలపైనే దృష్టి పెట్టారు. ట్రాఫిక్ సమస్యపైనా హైడ్రాకు బాధ్యత ఉంది. కానీ దాని గురించి ఏమాత్రం పట్టించుకోవట్లేదు. మాదాపూర్‌లో ప్రయాణం ఎంత సమయం పడుతుందో తెలుసు కదా? నిబంధనలు పాటించకుంటే హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వాల్సి వస్తుంది. సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేస్తేనే సామాన్యులు ఇళ్లు నిర్మిస్తున్నారు. స్థానిక సంస్థ అనుమతి ఇస్తేనే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో సామాన్యులు నష్టపోవాల్సి వస్తోంది. ఆదివారం కూల్చివేతలు వద్దని త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఉంది. అక్రమ నిర్మాణాలు అనిపిస్తే సీజ్ చేయవచ్చు కదా? హైడ్రా ఏర్పాటు అభినందనీయం.. పనితీరే అభ్యంతరకరం. అమీన్‌పూర్ తహసీల్దార్, హైడ్రా కమిషనర్ తీరు అసంతృప్తికరం. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదు. ఎఫ్టీఎల్ నిర్ధరించకుండా అక్రమాలు అని ఎలా తేలుస్తారని హైకోర్టు ప్రశ్నించింది. విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది. అప్పటివరకు యథాతథ స్థితి కొనసాగించాలని హైడ్రా, అమీన్‌పూర్ తహసీల్దార్‌ను ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయాలని చెప్పింది. ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తారా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు న్యాయమూర్తి ప్రశ్నించారు. అమీన్‌పూర్‌పైనే మాట్లాడాలని, కావూరిహిల్స్ గురించి అడగలేదంటూ కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని.. జంప్ చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో విజ్ఞప్తి మేరకు చర్యలు తీసుకున్నామన్నా రంగనాథ్ వివరణపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మార్వో అడిగితే గుడ్డిగా చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించారు. ఎమ్మార్వో అడిగితే చార్మినార్, హైకోర్టును కూడా కూల్చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు ఇదే విధంగా ముందుకు వెళ్తే స్టే ఇవ్వాల్సి వస్తుందన్నారు.

## హర్యానా, జమ్మూకశ్మీర్‌లో అధికారం కాంగ్రెస్‌దే

"హర్యానాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం. బీజేపీపై పిడుగుపాటు పడనుంది. హర్యాలోని ప్రధాన అంశం... జై జవాన్, జై కిసాన్, జై పహెల్వాన్. అక్కడ జవాన్లు, రైతులకు అన్యాయం జరిగింది. రెజ్లర్లపై వివక్ష నడుస్తోంది. హర్యానాలో కాంగ్రెస్ పార్టీ నినాదం ఇదే" అని జైరామ్ రమేష్ తెలిపారు. రైతు రుణాల మాఫీ, 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన విధంగా కేంద్రం కుల గణన చేపట్టాలని కాంగ్రెస్ బలంగా చెబుతోందని తెలిపారు.కనీస మద్దతుధరకు చట్టబద్ధత కల్పించాలని తాము అడుగుతున్నామని, రైతులు డిమాండ్ చేసున్నది కూడా ఇదేనని అన్నారు. రైతులు తమ డిమాండ్‌తో చేపట్టిన నిరసనల్లో 700 మంది ప్రాణాలు కోల్పోయినప్పటికీ మోదీ మాత్రం తన మౌనం వీడలేదని తప్పుపట్టారు. మూడు సాగు చట్టాలను కేంద్ర వెనక్కి తీసుకుందని, అయితే ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించడం, రైతు రుణాల మాఫీ ఇంకా అలానే ఉన్నాయన్నారు.

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హెూదా పునరుద్ధరణ

జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తుందనే నమ్మకం తమకుందని జైరామ్ రమేష్ చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధించాల్సిన అవసరం ఉందన్నారు. పీడీపీతో ఎన్నికల పొత్తు అంశంపై మాట్లాడుతూ, 'ఇండియా కూటమి'లో పీడీపీ భాగస్వామి అని, అయితే ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుందని చెప్పారు. ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమి విజయం సాధించే వాతావరణం ఉందన్నారు. భారత్ జోడో యాత్ర తర్వాత కాంగ్రెస్‌కు ఆదరణ పెరిగిందని చెప్పారు. జమ్మూకశ్మీర్‌రకు రాష్ట్ర హెూదా పునరుద్ధరణే తమ ప్రధాన డిమాండ్ అని, అందుకోసం పోరాడతామని తెలిపారు.

## ఆ పాటను ఎవరూ మరిచిపోలేరు

తనదైన ముద్ర వేశారన్నారు. 80వ దశకంలో దేశవ్యాప్తంగా యువతపై ఆయన ప్రభావం ఉందన్నారు. 'డిస్కో డ్యాన్సర్' చిత్రం ద్వారా ఆయన నృత్య శైలులు ఉర్రూతలూగించాయని గుర్తుచేశారు. "ఐ యామ్ ఏ డిస్కో డ్యాన్సర్..." అనే పాటను ఎవరూ మరచిపోలేరన్నారు. హిందీ చిత్రసీమలో అమితాబ్ బచ్చన్ తరవాత అంత క్రేజ్ దక్కించుకున్న కథానాయకుడు మిథున్ చక్రవర్తి అని అన్నారు. "నేను నటించిన 'గోపాల గోపాల' సినిమాలో లీలాధర్ స్వామిగా కీలక పాత్ర పోషించారు. విద్యార్థి దశలో వామపక్ష భావజాలం కలిగిన ఆయన తరవాతి కాలంలో టీఎంసీ, అటు పిమ్మట బీజేపీలో చేరారు. దశాబ్ద కాలంగా పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకోనున్న మిథున్ చక్రవర్తికి భగవంతుడు సంపూర్ణ సంతోషాన్ని, ఆయురారోగ్యాలను ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను" అని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కాగా.. సినీరంగానికి సంబంధించి అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డ్‌గా భావించే "దాదా సాహెబ్ ఫాల్కే" అవార్డ్ బాలీవుడ్ విలక్షణ నటుడు, లెజండరీ యాక్టర్ మిథున్ చక్రవర్తిని వరించిన విషయం తెలిసిందే. ఆయన ఈ అవార్డుకు ఎంపికైనట్లుగా సోమవారం నాడు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అధికారికంగా పేర్కొంది. 1950లో కోల్‌కతాలో జన్మించిన మిథున్ చక్రవర్తి.. 1976లో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 1976లో "మృగాయ" చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఆయన.. తొలి చిత్రంతోనే ఉత్తమ జాతీయ నటుడిగా అవార్డు అందుకున్నారు. హిందీ, బెంగాలీ, కన్నడ, తెలుగు, ఒరియా, భోజ్‌పురి చిత్రాల్లోనూ నటించి మెప్పించారు మిథున్ చక్రవర్తి. 1989లో మిథున్ చక్రవర్తి 19 సినిమాలు రిలీజ్ అయ్యాయి. హీరోగానే కాకుండా సహాయనటుడిగా, విలన్‌గా కూడా ఆయన ఎంతో మంది స్టార్ హీరోల చిత్రాల్లో నటించారు. తెలుగు చిత్రం "గోపాల గోపాల" చిత్రంలో నటించి తెలుగువారికి సుపరిచితమయ్యారు. ఈ ఏడాది ఆరంభంలో మిథున్ చక్రవర్తి "పద్మభూషణ్" అవార్డును కూడా అందుకున్నారు. అక్టోబర్ 8న జరగనున్న జాతీయ అవార్డుల ప్రధానోత్సవ వేడుకలో దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని మిథున్ చక్రవర్తి అందుకోనున్నారు. ఈ అవార్డుకు ఎంపికైన మిథున్ చక్రవర్తికి ప్రస్తుతం శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

## అక్టోబర్ 9న డీఎస్సీ నియామక పత్రాలు

హైదరాబాద్, (సెప్టెంబర్ 30) : అక్టోబర్ 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ నియామక పత్రాలు అందజేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం సచివాలయంలో డీఎస్సీ పరీక్షల ఫలితాలను సిఎం రేవంత్ విడుదల చేసారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేవలం 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చామని తెలిపారు. 1:3 నిష్పత్తిలో వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు ఇస్తామని ప్రకటించారు. పదేళ్లలో గత ప్రభుత్వం ఒకే ఒక్క డీఎస్సీ ఇచ్చిందని విమర్శించారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని, త్వరలోనే గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇస్తామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. డీఎస్సీ 2024 ఫలితాలను విడుదల చేసిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరో గుడ్ న్యూస్ చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పరిస్థితులు ఖాళీలు చూసుకొని డీఎస్సీపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఉద్యోగ నియామక పక్రియ అనేది నిరంతరం సాగేదని అన్నారు. ఇప్పుడు డీఎస్సీ పక్రియ నియామక పక్రియ పూర్తి అయిన తర్వాత ఇందులో ఉన్న మిగిలిపోయే ఖాళీలు, కొత్తగా ఏర్పడే ఖాళీలు తెప్పించు కొని డీఎస్సీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కచ్చితంగా ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకారమే ఉద్యోగాలు నియామకాలు జరుగుతాయన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఏ ఉద్యోగం కూడా ఖాళీ లేకుండా భర్తీ చేస్తామని అన్నారు. త్వరలోనే గ్రూప్ 1 రిజల్ట్స్ కూడా ఇస్తామన్నారు. గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసింది కానీ అక్కడ కనీస వసతులు కల్పించడంలో పూర్తి ఫెయిల్ అయిందన్నారు. పిట్టగూళ్లలో, పౌల్ట్రీ ఫామ్‌లో పేదల పిల్లలను వదిలేశారని ఆరోపించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయబోతున్నామని రేవంత్ ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి ఇరవై నుంచి ఇరవై ఐదు ఎకరాలల్లో ఈ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ మైనార్టీ విద్యార్థులను ఒకే చోట విద్యను అందించబోతున్నామని తెలిపారు. యూనివర్శిటీ స్థాయిలో ఈ రెసిడెన్సియల్ స్కూల్స్ ఉంటాయని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద ముందుగా కొడంగల్, మధిరలో ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటికే పనులు కూడా ప్రారంభమైనట్టు పేర్కొన్నారు. టెట్ తర్వాతనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. త్వరలోనే గ్రూప్ వన్ ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించారు. విద్యాశాఖ అధికారులు అతి తక్కువ సమయంలో ఉద్యోగాల భర్తీకి కృషి చేశారని అన్నారు. వారికి అభినందనలు తెలిపారు. 26ఆప్షన్ కింద డీఎస్సీ నిర్వహించామని వివరించారు. 1:3ప్రాతిపాదికన ఫలితాల ప్రకటించిన తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. దసరా లోపే 9అక్టోబర్ నాడు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకే ఒక్క నోటిఫికేషన్ వేసిందని మండిపడ్డారు.మాజీ సీఎం కేసీఆర్ కేవలం 7, 857 టీచర్లను మాత్రమే నియమించారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరి వల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య మీద పెట్టేది ఖర్చు కాదని తెలిపారు. పది నెలల్లోనే 11062 టీచర్ల భర్తీకి తాము కృషి చేశామని అన్నారు. ఇది తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చిన అనతికాలంలోనే 30వేల ఉద్యోగ పత్రాలు అందజేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతుందని హామీ ఇచ్చారు. గురుకులాల గురించి కేసీఆర్ చెప్పారని.. కానీ మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వంద నియోజక వర్గాల్లో యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ టీచర్ల పదోన్నతులు, బదిలీలు ఎందుకు చేయలేదని నిలదీశారు. దీని వల్ల టీచర్లలో నిరాశ ఏర్పడిందని చెప్పారు. 36వేల మంది టీచర్ల బదిలీలను ఎలాంటి విమర్శలు లేకుండా తాము పూర్తి చేశామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదని.. దాని వల్ల కొంత సమస్యలు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక



# ఖమ్మం కమిషనరేట్లో పట్టుబడిన 624 కిలోల గంజాయి దహనం

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** : వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ నేతృత్వంలో సోమవారం శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన, సీజ్ చేసిన 624 కిలోల ఎండు గంజాయిని అడిషనల్ డీసీపీ నరేష్ కుమార్ పర్యవేక్షణలో పోలీస్ ఫైరింగ్ రెంజ్ మంచుకొండ అటవీ ప్రాంతంలో నిర్వీర్యం చేశారు. ఖమ్మం వన్ టౌన్ , ఖమ్మం టూ టౌన్ , ఖమ్మం త్రీ టౌన్ , నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, వేంసూరు, కల్లూరు పోలీస్ స్టేషన్లకు సంబంధించిన 7 కేసుల్లో గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు జరిపిన నేరస్థులను అరెస్టు చేసినట్లు అడిషనల్ డీసీపీ తెలిపారు. జిల్లాలో ఠాణాల్లో నిల్వ ఉన్న గంజాయి సరకును కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల గెజిట్ నోటిఫికేషన్ల ఆధారంగా పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్వీర్యం చేశామన్నారు. కార్యక్రమంలో సిఐలు ఉదయ్ కుమార్, రమేష్, జానర్ధన్, ఉస్మాన్ షారిఫ్ , కల్లూరు ఎస్సై ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ ధాన్యం పక్కదారిపై మంత్రి "తుమ్మల"కన్నెర్ర

## - తక్షణమే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కు ఆదేశం
## - అలసత్వం వహించిన అధికారులు...
## - ఇష్టారాజ్యంగా వ్యవహరించిన మిల్లర్లపై ఎంక్వయిరీ
## - క్రిమినల్ కేసులు నమోదు,కఠిన చర్యలకు మంత్రి తుమ్మల గ్రీన్ సిగ్నల్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** : జిల్లాలో సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టడంపై వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు కన్నెర్ర చేశారు. అధికారుల అలసత్వం మిల్లర్ల ఇష్టారాజ్యంతో కోట్లాది రూపాయల ధాన్యం అక్రమార్కుల చేతిలో కి వెళ్లడం పై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ ముజ్మిల్ ఖాన్ కు మంత్రి తుమ్మల స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో అక్రమంగా ధాన్యం తరలింపు పై సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు. ధాన్యం పక్కదారి పట్టడానికి కారకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఈ వ్యవహారంపై ప్రత్యేక అధికారులతో లోతైన విచారణ చేపట్టి తక్షణమే ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ ను మంత్రి ఆదేశించారు. జిల్లాలో కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా మిల్లర్లు అక్రమాలకు పాల్పడ్డారని దీనిలో బాధ్యులైన ఏ ఒక్కరిని వదిలే ప్రసక్తే లేదన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్ళీ పునరావృత్తం కాకుండా నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తే ఎవరిని ఉపేక్షించవద్దన్నారు. పారదర్శక పాలనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని, దుర్వినియోగానికి పాల్పడిన వారికి శిక్ష తప్పదన్నారు. ధాన్యం అక్రమ రవాణాపై ప్రత్యేక విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ నమోదు చేయాలన్నారు. అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని మంత్రి తుమ్మల కలెక్టర్ ను ఆదేశించారు.

# చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 పై విస్తృత ప్రచారం చేయాలి

## - జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** : చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 పై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన చిన్నారి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, పిల్లల అక్రమరవాణా, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, ఆన్ లైన్ వేధింపులు, మాదకద్రవ్యాలు మొదలగు అంశాల నివారణ, పిల్లలలో వచ్చే శరీర మార్పులు, గుడ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన సంబంధిత అంశాలను వివరిస్తూ చిన్నారి గోడ ప్రతులను రూపొందించి అందరిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చైల్డ్ హెల్ప్ లైన్ కట్టుదిట్టంగా పనిచేస్తుందని, పిల్లల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, ఆన్ లైన్ వేధింపులు , మాదకద్రవ్యాలు మొదలగు అంశాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ కు సమాచారం అందించాలని అన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 పై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, డి. మధుసూదన్ నాయక్, డిఆర్డీవో సన్యాసయ్య, డిఆర్డీవో రాజేశ్వరి, జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, డిసిపివో విష్ణువందన, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో సర్వజ్ఞ విద్యార్థులు..




**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** : ఈ నేల 29 న ఖమ్మం జిల్లాలో సర్దార్ పటేల్ స్టేడియం లో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఖమ్మం జిల్లా తరుపున మన సర్వజ్ఞ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఎంపిక అవ్వడం ఎంతో గర్వకారణం. అండర్ 14,17 ఫుట్బాల్ మరియు అథ్లెటిక్ అండర్ 17 రన్నింగ్ లో సర్వజ్ఞ విద్యార్థులు ఎంపిక అవ్వడం ఎంతో ఆనందంగా వుందని పాఠశాల డైరెక్టర్ ఆర్వీ. నాగేంద్ర కుమార్ తెలిపారు. కేవలం ఆటపోటిల్లోనే కాకుండా అన్ని రంగాలలో కూడా విద్యార్థులను ముందంజ స్థాయిలో ఉంచడానికి సర్వజ్ఞ ఎప్పుడు తోడుగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా సర్వజ్ఞ విద్యార్థులకు వారి దినచర్యలో శారీరక విద్యను నేర్పించడం ద్వారా సమతుల్య జీవనశైలిని అభివృద్ధి చేయడంలో సహాయపడటానికి ఉపయోగపడుతుంది, ఇది సమతుల్యతను కనుగొనడంలో, ఒత్తిడిని తగ్గించడంలో మరియు వారి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఎంపికైన విద్యార్థులకు ఇది గొప్ప విజయం, వారి కృషి మరియు అంకితభావాన్ని మేము అభినందిస్తున్నాము. వారి రాబోయే పోటీల్లో విజయం సాధించాలని పాఠశాల అధ్యాపకులు మరియు యాజమాన్యం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ముమ్ముందు మరెన్నో పోటీ క్రీడలలో పాల్గొని విజయం సాధించి వారి జీవితంలో ఉన్నత స్థాయి కి ఎదగాలని డైరెక్టర్ ఆర్వీ. నాగేంద్ర కుమార్ తెలియజేసారు.

# బోనకల్లు పోలీస్ స్టేషన్ ను అకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్




**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** :ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కేసులు నమోదు చేసి నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. సోమవారం బోనకల్లు పోలీస్ స్టేషన్ పనితీరు ను పరిశీలించేందుకు అకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విధి నిర్వహణలో రోల్ క్లారిటీ వుండాలని, పోలీస్ స్టేషన్లకు వచ్చే అర్జీల విచారణ కోసం అప్పగించే భాధ్యతలను సెక్టార్ పోలీస్ అధికారులకు సిరియస్ గా తీసుకొని విచారణ చేపట్టాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా కృషి చేయాలని అన్నారు. కేసుల నమోదు విషయంలో తత్సారం చేయవద్దన్నారు. ప్రతి కేసులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, తద్వారా బాధితులకు సరియైన న్యాయం జరుగుతుందని అన్నారు.చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెంచాలని, సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమ రవాణా నియంత్రించేందుకు రాత్రి గస్తీ, పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ కు ఇటీవల వచ్చిన ఫిర్యాదులపై చేపట్టిన విచారణ నివేదికలను, రికార్డులను ఈ సందర్భంగా పరిశీలించారు.

# అక్టోబర్ 13 నుంచి ద్వారకా తిరుమలలో ఆశ్వయుజమాస దివ్యబ్రహ్మోత్సవాలు

**తిరుమల, తెలంగాణ ముచ్చట్లు** : అక్టోబర్ 13 నుంచి ద్వారకా తిరుమలలో ఆశ్వయుజమాస దివ్యబ్రహ్మోత్సవాలు ద్వారకా తిరుమలలో వేంకటేశ్వరుని ఆశ్వయుజమాస దివ్యబ్రహ్మోత్సవాలు అక్టోబర్ 13నుంచి20వరకూ వైఖానస ఆగమ యుక్తంగా నిర్వహిస్తామ ని ఆలయ ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తితెలిపారు.శ్రీవారి బ్రహ్మోత్సవా లను పురస్కరించుకుని ఆయా రోజుల్లో నిత్యార్జిత కల్యా ణాలను, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఆయన వివరించారు.అక్టోబర్ 17న రాత్రి8గంటలకు శ్రీవారితిరుకల్యాణమహోత్సవం నిర్వహిస్తామన్నారు.




# పసిడి పతకాల జోరులో రెజోనేన్స్ విద్యార్థుల ప్రభంజనం

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** :ఖమ్మం పట్టణంలో ఈనెల 28 తేదిలో సౌత్ జోన్, రూరల్ మరియు చింతకాని మండల స్థాయి లో జరిగిన కబడ్డీ, వాలీ బాల్ టోర్నమెంట్స్ నిర్వహించటం జరిగింది, ఈ స్కూల్ గేమ్స్ లో బాగంగా మా పాఠశాల నుంచి విద్యార్థులు కబడ్డి, వాలీ బాల్ ఆటలో పాల్గొని విజయకేతనం ఎగురవేసారు. అండర్-14 కబడ్డీ లో విభాగం నందు ఐ.పవన్ కుమార్, వాలీ బాల్ విభాగం నుంచి ఏ. సూర్య సుహాస్ బంగారు పథకం సాధించారు. అదేవిధంగా అండర్- 17 వాలీ బాల్ విభాగం నుంచి సిహెచ్. వర్షిత్ కుమార్ బంగారు పథకం సాధించి అంతర్ జిల్లా స్థాయి ఎంపిక అయ్యారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల డైరెక్టర్ నాగేంద్ర కుమార్ మరియు నీలిమ గార్లు మాట్లాడుతూ పథకాలు సాధించిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేస్తు చదువుతో పాటు విద్యార్థులకు ఆటలలో శిక్షణ ఇస్తూ వారిలో దాగివున్న ప్రతిభను వెలుగు తీస్తూ వాళ్ళ యొక్క మనో ధైర్యాన్ని, ఏకాగ్రత, క్రమశిక్షణకు ఆటలు ఎంతో ముఖ్యమని తెలియజేస్తూ వారి సంతోషాన్నివ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొని మరియు పి.ఇ.టి గెలిచిన క్రీడాకారులకు అభినందనలు తెలియజేసారు.

# మున్నేరు వరద బాధితులకు వనిత గ్రూప్ చేయూత



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** :మున్నేరు వరద బాధితులకు వనిత గ్రూప్ ప్రతినిధులు అండగా నిలిచారు. సోమవారం వరదలతో సర్వస్వం కోల్పోయిన 15మంది వరధ బాధితులకు దుస్తులు, బియ్యం, నూనె, ఉల్లిగడ్డలు, గొదుమ పిండి , శానిటరి పాడ్స్, తదితర నిత్యావసరాల సరకులను సత్య మార్గం సంస్థతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనిత గ్రూప్ ప్రతినిధులు గుడిమెట్ల రజిత, వైదేహి, హేమ, సత్యమార్గం సర్వీస్ సొసైటీ ప్రతినిధులు శ్రీలక్ష్మి, అనిత, మంజుల తదితరులు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా బావించి వరదలు వలన తీవ్రంగా నష్టపోయిన బాధితులకు మానవత్వంతో నెల రోజుల నుంచి సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో
మరో సంచలనం
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న తెలంగాణ ముచ్చట్లు తెలుగు దిన పత్రికకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్.సి.ఇన్చార్జిలు మండలాల వారిగా విలేకరులు కావలెను.
94936 69669, 9391230209

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక
మంగళవారం 1-10-2024


## ప్రజావాణి దరఖాస్తులను

# సత్వరమే పరిష్కరించాలి

### - జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** ప్రజావాణిలో తమ సమస్యలు తెలుపుతూ ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, డి. మధుసూదన్ నాయక్, డిఆర్డీవో సన్యాసయ్య, డిఆర్వోఓ ఎం. రాజేశ్వరి లతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను పరిష్కారానికి ఆదేశిస్తూ, సంబంధిత అధికారులకు ఫార్వార్డ్ చేశారు. తిరుమలాయపాలెం మండలం మేడిదపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన ముదిరెడ్డి నర్సిరెడ్డి ఎస్సారెస్పీ ఓల్డ్ కెనాల్ డిబిఎం 60.25 ఆర్ క్రింద 32 కుంటల భూమి కోల్పోయానని దానికి నష్టపరిహారం అందలేదని, ఆ భూమి రైతు బంధు డబ్బులు కూడా రాలేదని, నష్టపరిహారం, రైతుబంధు డబ్బులు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, భూ సేకరణ విభాగానికి రాస్తూ సమస్యను పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన పి. నాగరాజు మార్చి 4న పంచాయతీ కార్యదర్శిగా పోస్ట్ ఇస్తామని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్ ధ్రువీకరణ చేశారని, ఇప్పటి వరకు పోస్టింగ్ ఇవ్వలేదని, ప్రస్తుతం కల్లూరు, తల్లాడ, సత్తుపల్లి, వి.ఎం. బంజర మండలాల్లో ఖాళీగా ఉన్న పోస్టుకు అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ పరిపాలన అధికారికి రాస్తూ పరిశీలించి, ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ అన్నారు. కామేపల్లి మండలం ముచ్చర్ల రెవెన్యూ సాతానిగూడెం గ్రామానికి చెందిన డి. మంగతాయమ్మ సర్వే నెంబర్ 520లో తన 9 గుంటల భూమిని వై. వెంకట నారాయణ ఆక్రమించారని, రెవెన్యూ రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నగరం శ్రీనగర్ కాలనీకి చెందిన కోట సుమ తాను బిఎస్సీ, పిజిడిసిఏ, ఇంగ్లీష్, తెలుగు లోయర్, హయ్యర్ టైపింగ్ విద్యార్హత కలిగి ఉన్నానని, తనకు చెవిటి, మూగ బ్యాక్ లాగ్ పోస్టులలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ పరిశీలించి అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు

### - వివిధ అంశాలలో పోటీల నిర్వహణ
### - స్థానిక శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో జిల్లా స్థాయి యువ కళాకారుల ఎంపిక, సైన్స్ మేళా నిర్వహణ
### - జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి







**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు:** జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి అధికారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధికారులు, యువజన అవార్డు గ్రహీతలు పాల్గొని మాట్లాడారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన చూపిన మార్గాన్ని స్మరించుకున్నారు. అనంతరం సైన్స్ మేళా, జానపద నృత్యం, జానపద గేయాలు, లైఫ్ స్కిల్ కాంపోనెంట్, యువకృతి తదితర అంశాలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా క్రీడల సంస్థ మేనేజర్ ఉదయ్ కుమార్, యువజన సంఘాల జిల్లా అధ్యక్షులు ఉమా శంకర్, యువజన సంఘాల నాయకులు జక్కుల వెంకట రమణ, భవిష్య మెడికల్ అకాడమీ రాంరెడ్డి, అధికారులు, యువత పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల కొరకు అర్హత గల వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

### - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కొరకు కార్యచరణ ఖచ్చితంగా అమలు చేయడం జరుగుతుందని, అర్హత గల వారు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కార్యచరణ చేయడం జరిగిందని తెలిపారు. అర్హత గల వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ కొరకు ఫారం-18, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ కొరకు ఫారం-19 ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని, అక్టోబర్ 16వ తేదీన మొదటి రిపబ్లికేషన్, 25వ తేదీన రెండవ రిపబ్లికేషన్ చేయడం జరుగుతుందని, నవంబర్ 6వ తేదీన నమోదు చేసుకునేందుకు ఆఖరి తేదీగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. నవంబర్ 20వ తేదీన నమోదు అయిన దరఖాస్తులను పరిశీలించి ముసాయిదా జాబితా సిద్ధం చేసి 23న ప్రచురించడం జరుగుతుందని, 23 నుండి డిసెంబర్ 9వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, డిసెంబర్ 25వ తేదీన ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిష్కరించి సంబంధిత పత్రాలను పరిశీలించి 30వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాలకు జరుగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికలలో అర్హత గల ప్రతి ఒక్కరు తమ వివరాలు నమోదు చేసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. వివరాల కొరకు, దరఖాస్తు చేసుకునేందుకు ఆన్లైన్లో, తహశిల్దార్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

# కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా బిఆర్ఎస్ పార్టీ

### - బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్



**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** బిఆర్ఎస్ పార్టీకి వెన్నుముకగా నిలుస్తున్న పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని బిఆర్ఎస్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజా రమేష్ తెలిపారు. జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ 9వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త మృతి చెందగా సోమవారం పట్టణంలో కార్యకర్త కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజా రమేష్ మాట్లాడుతూ, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రమాద బీమా రెండు లక్షల రూపాయల చెక్కును కార్యకర్త కుటుంబానికి అందజేయడం జరిగిందని, కార్యకర్త కుటుంబానికి ఎప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్, బిఆర్ఎస్ నాయకుడు పారిపెల్లి తిరుపతి, పార్టీ నాయకులు బడికెల సంపత్ వంశీకృష్ణరావు, రవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు కృషి చేయాలి

### - రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్ కు వినతిపత్రం



**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** రాష్ట్రంలో రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు కృషి చేయాలని న్యాయవాది, తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాజలింగు మోతే, జిల్లా సభ్యుడు మాడుగుల కుమార్ లు కోరారు. ఈ మేరకు జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్ కు ఆయన నివాసంలో సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, నేడు రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై అనేక దాడులు, హత్యలు, అత్యాచారాలు, కుల దూషణలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ లపై జరుగుతున్న అఘాయిత్యాల సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్సీ అట్రాసిటీ నిరోధక చట్టం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, సమాజంలో మార్పు తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అట్రాసిటీ నిరోధక చట్టం నిర్వీర్యం కాకుండా చూడాలని, గ్రామస్థాయిలో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చట్టం సక్రమంగా అమలు అయ్యేలా చర్యలు చేపడితేనే బలహీన వర్గాల ప్రజలైన ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

# పారదర్శకంగా క్వార్టర్ల కౌన్సెలింగ్



**తెలంగాణ ముచ్చట్లు మందమర్రి:** ఏరియాలోని ఖాళీగా ఉన్న క్వార్టర్ల కేటాయింపు కొరకు సింగరేణి ఎన్సీడబ్ల్యుఏ ఉద్యోగులకు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించినట్లు సింగరేణి ఏరియా పర్సనల్ మేనేజర్ ఎన్ శ్యాంసుందర్ తెలిపారు. సోమవారం ఏరియాలోని సిఈఆర్ క్లబ్ లో క్వార్టర్ల కొరకు దరఖాస్తు చేసుకున్న కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏరియాలో ఖాళీగా ఉన్న క్వార్టర్ల కేటాయింపు కొరకు మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలకు 90 క్వార్టర్లను ప్రకటించగా, వీటికి 91 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించి, సీనియార్టీ ప్రకారం 26 మంది ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంచార్జ్ ఎస్ఓటు జిఎం రవీందర్, ఐఈడి డిజిఎం రాజన్న, డివైపిఎం మైత్రేయ బంధు, ఏరియా పర్సనల్ విభాగం కార్యాలయ సూపరింటెండెంట్ రాజలింగు, సిబ్బంది, ఎస్ అండ్ పిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU



## మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు ప్రారంభం

తెలంగాణ ముచ్చట్లు, మందమర్రి:మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగలి సునీత రావు పిలుపుమేరకు చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ల ఆదేశాల మేరకు పట్టణంలో సోమవారం మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు గడ్డం రజిని మాట్లాడుతూ, ఈ సభ్యత్వం ఐదు సంవత్సరాల వరకు పని చేస్తుందని తెలిపారు. ప్రతి మహిళ 100 రూపాయల రుసుము చెల్లించి, మహిళ కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోవాల్సిందిగా కోరారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, దీనికి నిదర్శనమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 6 గ్యారంటీ పథకాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, నాయకులు సోత్కు సుదర్శన్, మంద భాస్కర్, కడారి జీవన్ కుమార్, బూడిద శంకర్, మంకు రమేష్, బుర్ర ఆంజనేయులు గౌడ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు పోచంపల్లి లక్ష్మీ, కళ, రమ, కవిత, ప్రసన్న నాయకులు తూముల శ్రీనివాస్, రవీందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మేధా పాఠశాల కరస్పాండెంట్ పాపయ్య కు డాక్టరేట్



వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు: వనపర్తి జిల్లా శ్రీ మేధా పాఠశాల కరస్పాండెంట్ పాపయ్య కు శనివారం న్యూఢిల్లీలో ఎంబీఆర్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది .విద్యారంగంలో విశిష్ట సేవలను అందించినందుకు గాను పాపయ్యకు డాక్టరేట్ తో ఎంబీఆర్ యూనివర్సిటీ సత్కరించింది. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ... తనకు డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందని, సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

## కలెక్టర్ ను కలిసిన మీడియా పాయింట్ ప్రతినిధులు



హసన్ పర్తి తెలంగాణ ముచ్చట్లు : నూతనంగా ఏర్పడిన హసన్ పర్తి మీడియా పాయింట్ ప్రతినిధులు శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీకై వచ్చిన కలెక్టర్ ను మీడియా పాయింటు ప్రతినిధుల బృందం కలిసి గ్రామంలోని సమస్యలను, విలేకరుల సమస్యలను దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ను కలిసిన వారిలో మీడియా పాయింట్ అధ్యక్షుడు ఎలుక రాజు సదానందం, ప్రధాన కార్యదర్శి గోలే రవీందర్, ఉపాధ్యక్షుడు నద్దునూరి బాబు, కోశాధికారి తాళ్లపల్లి సాయికుమార్, వరంగల్ ప్రెస్ క్లబ్ ఈసీ నెంబర్ కందుకూరి సంజీవ్, కమిటీ సభ్యులు కనుకుంట్ల సతీష్, గడ్డం సంపత్ లతోపాటు వేల్పుల ఓదెలు, చిరంజీవి లో ఉన్నారు.

# చదువుకున్న పాఠశాలకు ఎస్పీ రూపేష్ ఔదార్యం

### - దాతల సహకారంతో 42 లక్షల చెక్కులు అందజేత
### - ప్రభుత్వ పాఠశాల బలోపేతంపై మమకారం




హసన్ పర్తి తెలంగాణ ముచ్చట్లు: కడు పేదరికంలో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి వరకు విద్యనభ్యసించి దేశం గర్వించే విధంగా ఐపీఎస్ సాధించిన హసన్ పర్తి వాసి సంగారెడ్డి జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ గా విధులు నిర్వహిస్తున్న చెన్నూరి రూపేష్ శనివారం తాను చదువుకున్న స్థానిక ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ క్యాంపస్ ఆవరణలో ఉన్న కళాశాల స్థితిగతులను, బాలికల ఉన్నత పాఠశాల పరిస్థితులను, బాలుర పాఠశాల విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సుమారు రెండు గంటలసేపు పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో అవసరమైన కనీస సౌకర్యాలను అడిగి తెలుసుకున్నాడు. పాఠశాలలో డిజిటల్ లైబ్రరీ, జూనియర్ కళాశాలపై సెమినార్ హాల్, ఇతర అవసరాలను తీర్చుటకు ముందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. సంగారెడ్డిలో వందల మందికి ఉపాధి కల్పిస్తున్న ఫ్యాక్టరీల అధినేత సత్యనారాయణ, వినోద్ లు పాఠశాల అవసరానికి 25 లక్షల చెక్కులను కలెక్టర్ ద్వారా పాఠశాల ప్రిన్సిపాల్ లకు అందజేశాడు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో తయారు చేయబడిన సుమారు 7 లక్షల విలువ గల స్టడీ మెటీరియల్ రూపేష్ పంపిణీ చేయడం చాలా సంతోషదాయకమని అన్నారు. విద్యార్థులు వాటిని ఉపయోగించుకొని ఉన్నత స్థానాలను చేరుకోవాలని, తద్వారా దాతలకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు. పాఠశాల ఆవరణంలో అవసరమైన అభివృద్ధి చేయుటకు అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపికైనందున తమ ద్వారా 10 లక్షల రూపాయలను విడుదల చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీల అధినేతలైన సత్యనారాయణను, ఉదయ్ లను పాఠశాల సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించుకున్నారు. తరువాత సత్యనారాయణ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరము మంచి మార్కులతో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి 50 వేల రూపాయలను బహుమతిగా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపాడు. ఈ కార్యక్రమంలో తాను చదువుకున్న పాఠశాలను మరువకుండా, దాని అభివృద్ధిని భుజస్కందాలపై వేసుకొని ముందుకు వచ్చిన ఎస్పీ రూపేష్ ను పాఠశాల సిబ్బంది, కళాశాల సిబ్బంది, స్థానిక పోలీస్ యువకులు, స్థానిక ప్రజలు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామ్ నరసింహ చారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, బాలుర స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సుమా దేవి, స్థానిక నాయకులు విద్యాసాగర్, ఆకుతోట రాంబాబు, చెన్నూరి రవి, శీలం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మసీదును సందర్శించండి : ఎస్ ఐ ఓ




ఎమ్మిగనూరు,తెలంగాణ ముచ్చట్లు : కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని మక్కా మసీదు నందు "మసీద్ సందర్శించండి" అనే శీర్షికన ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ ప్రోగ్రాం లో విచ్చేసిన మల్లెల ఆల్ఫ్రెడ్ రాజుగారు మాట్లాడుతూ "ఇది ఎంతో మంచి కార్యం ఇలాంటి కార్యక్రమాల వలన ఒకరి మతాల గురించి ఒకరు తెలుసుకొని పరస్పరం గౌరవించుకుంటారు " అని తెలియజేశారు. జాతీయస్థాయిలో సందేశ ఉద్యమాన్ని నిర్వహించినట్టు అందులో భాగంగానే మన పట్టణంలో కూడా ఈ ప్రోగ్రాం చేస్తున్నట్లు పట్టణ అధ్యక్షులు ఆసిఫ్ గారు తెలిపారు. ఎమ్మిగనూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ మాట్లాడుతూ మక్కా మసీదును సందర్శించి అన్ని మతాలవారు పరస్పరం గౌరవించుకోవాలని, విభిన్న కులాలు, మతాలు, జాతులు ఉన్న దేశం మన దేశమని ఆయన అన్నారు. మాల మహానాడు మధుబాబు మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం, పరమత సహనానికి నిదర్శనం మన దేశంఅని. ఇక్కడ అందరూ కలిసిమెలిసి జీవించాలని ఒకరు మరొకరు గౌరవించుకోవాలని, ఒకరి సంప్రదాయాలు మరొకరు గౌరవించాలని తెలిపారు. ఈ ప్రోగ్రాం లో "ఇస్లాం కు సంబంధించిన మౌలిక విషయాలు ఎక్సపో రూపంలో నిర్వహించి సదరు మతస్తులకు ఇస్లాం గురించి అవగాహన కల్పించాము" అని తెలియపరిచారు స్థానిక సందేశ కార్యదర్శి అల్తాఫ్ గారు. రాష్ట్ర సలహా మండలి సభ్యులు ఇమ్రాన్ మాట్లాడుతూ " ఈ ప్రోగ్రాం యొక్క ముఖ్య ఉద్దేశం పరమత సహనాన్ని పెంపొందించడం, ఇస్లాం మౌలిక సందేశమైన మానవులంతా ఒక్కటే మానవులందరికీ దేవుడు ఒక్కడే. మానవులంతా ఆయన ముందు సమానులే, ఎవరైతే ఆ సర్వ లోకాల సృష్టికర్త ఆదేశాల అనుసారం జీవితాన్ని గడుపుతాడో సాఫల్యం పొందుతాడు అనే సందేశాన్ని ప్రజలకు చేరవేయడం" అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాల్కోట్ ఖదీర్, జమాతే ఇస్లామి హింద్ స్థానిక అధ్యక్షుడు చాంద్ భాషా, ఫ్లోర్ లీడర్ దయాసాగర్, మాల మహానాడు మధుబాబు, టీచర్ మల్లికార్జున, మాల నరసన్న,మక్కా మసీద్ ముతవల్లి అమిర్ భాష, ఎస్ ఐ ఓ సభ్యులు : ఉమర్, సుహేల్, అమీర్, ఖమర్, ముసయిబ్, రిహాన్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

ప్రకాశం, తెలంగాణ ముచ్చట్లు : ప్రకాశం జిల్లా గిద్దలూరు తిరుమలలో కొలువైన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని గిద్దలూరు ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి గారు సోమవారం ఉదయం దర్శించుకున్నారు. వారితో పాటు ఎమ్మెల్యే సోదరుడు కృష్ణ కిషోర్, కుమారుడు దివ్యేష్ రెడ్డి మరియు డా., చిట్యాల వెంకటేశ్వర రెడ్డి, పాముల విజయ భాస్కర్, మధుసూదన్ రెడ్డి, అంబవరం శ్రీనివాస రెడ్డి, నంది శ్రీను, భూమిరెడ్డి రామచంద్రా రెడ్డి, బిజ్జాల భరత్, భవనం శ్రీధర్ రెడ్డి, చలిచీమల శ్రీనివాస చౌదరి, ఓబుల్ రెడ్డి, ఆవుల చంద్ర, నిమ్మకాయల శేఖర్, రామిరెడ్డి సురేష్ రెడ్డి, దూదేకుల దస్తగిరి బొర్రా రాఘవేంద్ర యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## అధైర్యపడొద్దు.. ఇళ్లు ఇస్తాం

### - రంగారెడ్డి కలెక్టర్ శశాంక

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : మూసీ రివర్‌బెడ్ ప్రాంతంలో ఇండ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న వారికి అవగాహన కల్పించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయిస్తున్నామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రాములుతో కలిసి మాట్లాడారు.. కేపి

## దళిత, గిరిజనుల సమస్యల పట్ల పలు అధికారులను కలిసిన జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ



తాడేపల్లి, తెలంగాణ ముచ్చట్లు : జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నేడు రాష్ట్ర దళిత, గిరిజనుల సమస్యల పట్ల ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజ, ఆంధ్రప్రదేశ్ లీడ్ క్యాప్ మేనేజర్ అధికారి, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ జీవపుత్ర కుమార్ గారులను మర్యాదపూర్వకంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ కలిసి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో దళిత గిరిజనులు సమస్యలు అప్పటి ప్రభుత్వ అధికారులు పరిష్కరించకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండడం జరిగినది. ఇప్పుడున్న ప్రభుత్వ అధికారులైన త్వరిగతన సమస్యలు పరిష్కరించాలని మాట్లాడితే, అధికారులు సానుకూలంగా స్పందించారని మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ విజయవాడ, గుంటూరు జిల్లాల నాయకులు క్రీస్తు దాసు, తాడికొండ చిరంజీవి, జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా కన్వీనర్ గంధాలం మణికుమార్, జై భీమ్ ఎమ్మార్పీఎస్ గోనెగండ్ల మండల అధ్యక్షుడు యనగండ్ల ప్రసన్నకుమార్, జై భీమ్ ఎమ్మార్పీఎస్ కోడుమూరు నియోజకవర్గ నాయకులు ప్రేమ్ కుమార్, జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూల్ టౌన్ నాయకులు కరుణ బాబు, ప్రసాదు మరియు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ఫలితాల్లో ఉచిత మెడికల్ సీట్ సాధించిన రౌడూరు గ్రామ విద్యార్థిని సుధా పరిమళ




రౌడూరు:తెలంగాణ ముచ్చట్లు : కర్నూలు జిల్లా కౌతాళం మండలం రౌడూరు గ్రామానికి చెందిన సుధా పరిమళ అనే విద్యార్థినికి ఉచిత మెడికల్ సీట్ లభించింది, చెన్నారెడ్డి కొడుకు కృష్ణా నందా రెడ్డి ఏ శారద దంపతుల కూతురు సుధా పరిమళ ఇటువల విడుదలైన నీట్ ఫలితాల్లో 690/720 మార్కులు సాధించింది స్టేట్ ర్యాంక్ 6860 సాధించింది,ఆమెకు హైదరాబాద్ గాంధీ హాస్పిటల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజిలో ఉచిత ఎంబిబిఎస్ సీటు లభించింది,%=.ఎ% సుధా పరిమళ ఎంబిబిఎస్ సీటు సంపాదించడంతో మండలానికి గర్వకారణం అని కుటుంబ సభ్యులు,గ్రామస్తులు విద్యార్థినికి అభినందనలు తెలుపుతున్నారు. ఇంతటి ఘనత సాధించి మన రౌడూరు గ్రామానికే గర్వకారణమని గ్రామ నాయకులు వారి కుటుంబ సభ్యులకు అభినందలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

## - ప్రతి సమస్యను క్షుణ్ణంగా చదివి అర్థవంతమైన ఎండార్స్మెంట్ ఇవ్వండి
## - పిజిఆర్ఎస్ కు 307 వినతులు - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల, తెలంగాణ ముచ్చట్లు : ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రజా వినతులను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం - (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ ఎ. పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి అర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రతి అధికారి శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులను సీఎం స్వయంగా పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారంపై పూర్తిస్థాయి దృష్టి సారించాలన్నారు. తాను ఇటీవల పిజిఆర్ఎస్ కమాండ్ కంట్రోల్ రూమ్ లో ఫిర్యాదుల పరిష్కారం పై ఆడిట్ నిర్వహించానని కొన్నింటిని పరిశీలిస్తే 10 శాఖలు పొంతనలేని సమాధానంతో ఎండార్స్మెంట్ ఇచ్చారని చదివి వినిపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎండార్స్ ఇచ్చిన విషయం ఫిర్యాదుదారునికి ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని కలెక్టర్ ప్రశ్నించారు. ఫిర్యాదుదారుడి సమస్యకు సంబంధించి సరియైన ఎండార్స్మెంట్ ఇవ్వడంలో ఎందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆమె ప్రశ్నించారు. సరియైన ఎండార్స్మెంట్ ఇవ్వని ప్రతి దరఖాస్తును రీఓపెన్ చేయిస్తామన్నారు. ఫిర్యాదుదారుని అర్జీ మీ శాఖది కాకపోతే సంబంధిత శాఖకు తక్షణమే ఫార్వర్డ్ చేయాలని ఆమె ఆదేశించారు. అర్జీలను ఎటువంటి పరిస్థితిలలో తిరస్కరించకుండా తెలుగులో అర్జీదారునికి అర్థమయ్యే రీతిలో నాలుగైదు వాక్యాలు స్పష్టంగా వ్రాసి పంపాలన్నారు.

**పిజిఆర్ఎస్ లో కొన్ని సమస్యలు**

1) నంద్యాల మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన మునిసిపాలిటీ పారిశుధ్య సిబ్బందిని తొలగించి వారి స్థానంలో కొత్త వారిని తీసుకుంటున్నట్లు గ్రామ సర్పంచ్ తెలుపుతున్నారని... ఉద్యోగం మీదనే ఆధారపడి జీవించే తమకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు.

2) మిడ్తూరు మండలం సుంకేసుల గ్రామ కాపురస్తురాలు గోపాలం సంజమ్మ తన పొలం ఆర్ఓఆర్ కేసు లో తనకే చెందినప్పటికీ ఇంకా తన పేరు మీద పట్టాదారు పాసుపుస్తకాలు రాలేదని... ఆన్లైన్లో తన పేరు నమోదు చేయడంతో పాటు పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు.

3)బండి ఆత్మకూరు మండల వాస్తవ్యుడు షేక్ సమీర్ తనకు 3 సెంట్ల స్థలం ఉన్నదనీ... పక్కనవున్న స్థలంలో కొలతలు వేయకుండా ఇంటి నిర్మాణం చేపట్టడం వల్ల తనకు 1/4 సెంటు తక్కువగా వచ్చిందని తనకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో 307 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# జిల్లాలో మైక్రో ఇరిగేషన్ కింద సాధించవలసిన లక్ష్యాన్ని అందుకునేందుకు సంబంధిత అధికారులు సమిష్టిగా కృషి చేయాలి

## - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



నెల్లూరు,తెలంగాణ ముచ్చట్లు : జిల్లాలో మైక్రో ఇరిగేషన్ కింద సాధించవలసిన లక్ష్యాన్ని అందుకునేందుకు సంబంధిత అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో రెవెన్యూ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, మ్యూటేషన్లు, స్వచ్ఛతా హి సేవ, మైక్రో ఇరిగేషన్ లక్ష్య సాధన, ఎటువంటి ఆధారాలు లేని ఎస్టీలకు బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుల మంజూరు, 1వ ఎన్ టి ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ఉపాధిహామీ పనిదినాల పెంపు మొదలైన అంశాలపై సబ్‌కలెక్టరు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడీవోలు, తహశీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో మైక్రో ఇరిగేషన్ కింద 10,500 హెక్టర్లు లక్ష్యంగా నిర్ణయించినందున, అందులో భాగంగా మైక్రో ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రాథమిక తనిఖీ నిర్వహించేందుకు అన్ని మండలాలకు షెడ్యూలు తయారు చేశామన్నారు. షెడ్యూల్ ప్రకారం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించే రోజుల్లో వీఐవోలు, వీహెచ్వోలు విధిగా హాజరుకావాలన్నారు. ఆయా తేదీలలో ఎటువంటి సెలవులు పెట్టరాదని, గైర్హాజరు ను తీవ్రంగా పరిగణిస్తామన్నారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ప్రాథమిక సర్వే తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా రెవెన్యూలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల మంజూరు, మ్యూటేషన్ ట్రాన్సాక్షన్లపై తహశీల్దార్లు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఎటువంటి కారణాలు లేకుండా అప్లికేషన్లు తిరస్కరణ చేయవద్దన్నారు. రీఓపెన్ చేసిన అర్జీలను నిశితంగా పరిశీలించి అవసరమైన సందర్భంలో ఆయా అర్జీదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా వున్న ఎస్టీలకు బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులను ఇప్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఎంపిడివోలకు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్టుమెంటు ద్వారా ఆధార్‌కార్డు లేని ఎస్టీల జాబితాలు పంపినట్లు చెప్పారు. ఈ మేరకు నాన్ అవైలబుల్ సర్టిఫికెటు, అఫిడవిట్ తయారుచేసి దరఖాస్తు చేయించాలని, దీని వల్ల ఎస్టీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంది, ఆయా కుటుంబాలు లబ్ది పొందుతాయన్నారు. అలాగే ఎన్ టి ఆర్ భరోసా పెన్షన్స్ ను మొదటి తేదినే 95% కు పైగా పంపిణీ చేయుటకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి క్లస్టర్లో ఉదయం 6 గంటలకు పెన్షన్ పంపిణీ ప్రారంభించాలన్నారు. అదేవిధంగా ఓటరు జాబితాకు సంబంధించిన హౌస్ హోల్డ్ తనిఖీలను ఎన్నికల సంఘం నిర్ణయించిన షెడ్యూల్ మేరకు పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ కార్యక్రమంలో ప్రతివారం ఖచ్చితమైన పురోగతి ఉండాలన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని బ్యాంకు మేనేజర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి లింకు డాక్యుమెంట్లు ద్వారా లబ్ధిదారులకు రుణాలు ఇప్పించేందుకు కృషి చేయాలన్నారు. బ్యాంకు అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినందున ఎటువంటి తాత్సారానికి తావు లేకుండా రుణాలు మంజూరు చేయించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ కార్తిక్ , డి ఆర్ ఓ లవన్న, జడ్పి సిఇవో ఖాదర్ భాషా, ఎ పి యం ఐ పి పిడి శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, హౌసింగ్ పిడి వేణుగోపాల్ , ఐటిడిఎ పివో పరిమళ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీల రీ ఓపెన్ కేసుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్




నెల్లూరు, తెలంగాణ ముచ్చట్లు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీల రీ ఓపెన్ కేసుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం పై జిల్లా అధికారులతో సమీక్ష చేసారు.అనంతరం ప్రజలనుండి అర్జీలు స్వీకరించి పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ సమీక్ష చేస్తూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 251 అర్జీలు రీ ఓపెన్ అయ్యాయన్నారు. ప్రధానంగా రెవెన్యూ,పోలీస్, పంచాయతీ రాజ్ , సర్వే శాఖల్లో అర్జీలు రీ ఓపెన్ అవుతున్నా యన్నారు. రీ ఓపెన్ కేసులు తగ్గించేందుకు అధికారులు ప్రయత్నం చేయాలన్నారు.అర్జీదారుడు సంతృప్తి చెందక పోతే అర్జీలు పునరావృత మవుతాయని,అందువల్ల అర్జీదా రులతో మాట్లాడి సమస్య ఎందుకు పరిష్కారం కాదో వివరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు సానుకూలంగా పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు.అర్జీలు సరి అయిన కారణాలు లేకుండా తిరస్కరించ వద్దని ఆయన అధికారులకు సూచించారు.

**కోర్టు కేసులపై దృష్టి పెట్టండి**

జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో ఉన్న కోర్టు కేసుల పై అధికారులు స్పందించాలన్నారు. చాలా పెద్దయెత్తున కోర్టు కేసులు ఉన్నాయని వీటిలో కంటెంప్ట్ కేసులు కూడా ఉన్నాయన్నారు.,కేసులపై కౌంటర్ అఫిడవిట్లు,వకాల్టాలు ఫైల్ చేయాలన్నారు. జిల్లా అధికారులు కోర్టు కేసులకు సంబంధించిన వివరాలు అన్ లైన్ లో పొందు పరచాలన్నారు. కోర్టు కేసుల పరిష్కారం పై జిల్లా,మండల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 330 దరఖాస్తులు**

ప్రజా సమస్యల ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వివిధ సమస్యలపై 330 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు అందజేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.లవన్న,జిల్లా పరిషత్ సి.ఇ. ఓ ఖాదర్ వలి, జిల్లా పంచాయతీ అధికారి సుస్మితా రెడ్డి,డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.గంగా భవాని, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పెంచలయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# హియరింగ్ ఎయిడ్స్ ను విభిన్న ప్రతిభావంతుల చిన్నారులకు పంపిణీ





గుంటూరు, తెలంగాణ ముచ్చట్లు : సోమవారం కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, అసిస్టెంట్ కలెక్టర్ పొవర్ స్వప్నిల్ జగన్నాథ్ లతో కలసి రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం ద్వారా స్వరుప్ ఛారిటబుల్ ట్రస్ట్ వారు అందించిన హియరింగ్ ఎయిడ్స్ ను విభిన్న ప్రతిభావంతుల చిన్నారులకు పంపిణీ చేశారు. న్యూఢిల్లీ కి చెందిన స్వరూప ఛారిటబుల్ ట్రస్ట్ 150 మంది విభిన్న ప్రతిభాంతులైన చిన్నారులకు అవసరమైన రూ. 60,000 హియరింగ్ ఎయిడ్ అందించటం అభినందనీయం అని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా వైద్యాశాఖ అధికారిణి డా. విజయలక్ష్మీ, స్వరూప్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి రవిశర్మ, ఆర్బీఎస్కే కో ఆర్డినేటర్ డా. ఏ శ్రావణ బాబు, విభిన్న ప్రతిభావంతుల చిన్నారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 187 అర్జీలు

## - ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్ ) లో వచ్చిన అర్జీలకు త్వరిత గతిన అర్థవంతంగా పరిష్కారం చూపాలి

తిరుపతి, తెలంగాణ ముచ్చట్లు : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా అర్థవంతంగా పరిష్కారంకోసం చూపాలని, అలసత్వం వహించరాదని జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ పెంచల్ కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు నరసింహులు, దేవేంద్ర రెడ్డి లతో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు.

**శాఖల వారీగా అర్జీల వివరాలు**

రెవెన్యూ శాఖ - 120 , పంచాయతీరాజ్ శాఖ -08, డి.ఆర్.డి.ఏ - 15, పోలీస్ శాఖ -6, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ -4, స్కిల్ డెవలప్మెంట్ -1, మునిసిపల్ కార్పొరేషన్ - 9, విద్యుత్ శాఖ-1, పశుసంవర్ధక శాఖ -1, అగ్నిమాపక శాఖ -1, కలెక్టర్ సూచించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU




# తిరుపతి లడ్డు అపవిత్రతపై దోష పరి హారార్థం ద్వారకా తిరుమలకు సైకిల్ యాత్ర

## -గోకవరపు సునీల్ అధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, తెలంగాణ ముచ్చట్లు :తిరుపతిలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు అందించే లడ్డులో గత వైసిపి ప్రభుత్వం చేసిన ఘోర దోషనికి దోష పరిహారం నిమిత్తం మిత్రుడు గోకవరపు సునీల్కుమార్ యూత్ అధ్వర్యంలో చిన్న తిరుపతి వరకు సైకిల్ యాత్ర నిర్వహించడం గొప్ప విషయమాని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం స్థానిక అర్యవైశ్య కళ్యాణ మందిరం సమీపంలోని శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి ఏలూరు సమీపంలోని ద్వారకా తిరుమల దేవస్థానం వరకు లడ్డులో జరిగిన దోషనికి దోష పరిహారం కోసం టిడిపి నాయకుడు గోకవరపు సునీల్ కుమార్ యూత్ అధ్వర్యంలో సుమారు 150 మంది సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జెండాను ఊపి ప్రారభించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రతి విషయంలోను మోసం చేస్తు వచ్చిందన్నారు. దేవుడు విషయంలో కూడ ఇంత గోరమైన పాపనికి ఒడి గంటి తిరుపతిలో భక్తులకు అందించే దేవుని ప్రసాదం అయిన లడ్డులో డబ్బులు కోసం తక్కువ ధరకు లభించే జంతువుల నుండి తీసే న్యెయితో లడ్డును అందించడం ఘోర తప్పిందమన్నారు. ఈ లాంటి పాపనికి పరిహారంగా భక్తులు యాత్రలు చేసి దోషనిని ప్రాయశ్చిత్తంగా సైకిల్ యాత్రను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళీ, బిజెపి ఇన్చార్జి దావులూరి సురేంద్రబాబు, అర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకునే ప్రక్రియ ఇదే

గుడివాడ, తెలంగాణ ముచ్చట్లు : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు 20 25 మార్చిలో జరగనున్న దృష్ట్యా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి. 30.09.2024 నుంచి 6.11.2024 వరకు కేంద్ర ఎన్నికల కమిషన్ వారి వెబ్ సైట్ లో ఓటు నమోదు చేసుకోవచ్చు. అలాగే మీరు నివాసం ఉండే పరిధిలోగల ఎమ్మెర్వో కార్యాలయం ద్వారా కూడా ఫారం 18 ధాఖలు చేసి ఓటు నమోదు చేసుకోవచ్చు. ఫారం 18లో పాస్పోర్ట్ ఫొటో, గెజిటెడ్ ఆఫీసర్ చే ధృవీకరించిన డిగ్రీ సర్టిఫికెట్ నకలు, ఓటర్ ఐడి కార్డు, ఆధార్ కార్డు కూడా జతపరచాలి. తర్వాత వెరిఫికేషన్ అప్పుడు ఒరిజినల్ సర్టిఫికెట్స్ చూపించాల్సి ఉంటుంది. ఓటరుగా నమోదు కావడానికి జూన్ 2021లోపు డిగ్రీలో ఉత్తీర్ణత పొంది ఉండవలెను. ఈ అర్హతలున్నవారు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పట్టభద్రులందరూ తమ ఓటును నమోదు చేసుకోవచ్చు.

గమనిక: 10౦2౦3 పద్ధతిలో డిగ్రీ పాసైన వారు ఓటరు నమోదుకు అర్హులు. అలాగే ఇంజినీరింగ్, మెడిసిన్, సీఏ ఇతర పీజీ డిప్లొమా పూర్తి చేసిన వారు కూడా ఓటరు నమోదుకు అర్హులు. 10వ తరగతి తరువాత దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేసిన వారు అనర్హులు.

# స్ఫూర్తి ప్రదాత విజయనగరం మహారాజా పివిజి రాజు శతజయంతి సభకు ఆహ్వానం


గుంటూరు, తెలంగాణ ముచ్చట్లు : ఠాగూర్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు పి. రామచంద్ర రాజు ప్రముఖ గాయకులు డా! గజల్ శ్రీనివాస్ ఈనెల 30వ తేదీన విజయనగరం లో పి. అశోక్ గజపతి రాజు స్వగృహంలో కలిసి అక్టోబర్ చివరి వారంలో గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుప తలపెట్టిన పూసపాటి విజయరామ గజపతి రాజు శత జయంతి సభకు విశిష్ట అతిథిగా హాజరు కావలసిందిగా విజ్ఞప్తి చేశారు. పివిజి రాజు మనసున్న మహారాజని, దాతృత్వానికి ప్రతీక గా తెలుగు ప్రజల మనస్సులలో చిర స్థాయిగా నిలిచిన మహనీయుని శత జయంతి సభ గుంటూరులో ఘనంగా జరపడానికి కృషి చేస్తున్నామని పి. అశోక గజపతి రాజుకి తెలిపారు. పివిజి రాజు శతజయంతి సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను ఆహ్వానించామని వారు సామకూలంగా స్పందించారని అశోక గజపతి రాజుకు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న సంస్థలను, నిస్వార్ధంగా కృషి చేస్తున్న మహనీయులను, పౌర సంస్థల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నారు.

# చేదుర్తి పాడు లో వరద బాధితులకు యాహు సంస్థ నిత్య అవసరాలు పంపిణీ

## -సీఎం చంద్రబాబుకు మద్దతుగా నిలిచిన దాతలు మరియు స్వచ్ఛంద సంస్థలకు ఎమ్మెల్యే రాము ధన్యవాదాలు

## -వరద కష్టకాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే రాముకు.... ఆత్మీయ ధన్యవాదాలు తెలిపిన ప్రజలు





నందివాడ, తెలంగాణ ముచ్చట్లు : చరిత్ర చూడని వరదల సమయంలో ప్రభుత్వం అందించిన సహాయ కార్యక్రమాలకు.... దాతలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు చేసిన సేవలకు బాధిత ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతు న్నానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. నందివాడ మండలం చేదుర్తిపాడులో వరద ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన ప్రజలకు యాహూ కంపెనీ ఉద్యోగులు అందించిన నిత్యవసరాలను. ఉద్యోగులతో కలిసి ఎమ్మెల్యే రాము సోమవారం మధ్యాహ్నం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరద కష్ట కాలంలో ఎమ్మెల్యే మరియు కూటమి నేతలు అందించిన సహకారానికి బాధిత గ్రామాల ప్రజలు ధన్యవాదాలు తెలియజేస్తూ...... ఎమ్మెల్యే రామును ఆత్మీయంగా కౌగిలించుకున్నారు. ప్రజలకు నిత్యవసరాలను పంపిణీ చేసిన అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మీడియాతో మాట్లాడుతూ చరిత్ర చూడని వరదలతో నందివాడ మండలంలో బూడమేరు పరివాహక గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్ట పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద కష్ట కాలంలో బాధితులకు సహాయంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం... చేసిన కృషిలో ....... అధికారులు, కూటమి నాయకులు, ఎంతో చైతన్యంతో భాగస్వామ్యులు అయ్యారని వారందరికీ బాధ్యత ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే రాము అన్నారు. మండలంలో వరద ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్క బాధితుడికి పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నానని..... త్వరలో బాధిత ప్రజలకు పరిహారం అందుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు చేకూరు జగన్ మోహన్ రావు, యాహు కంపెనీ ఎంప్లాయిస్ దేవరపల్లి వినయ్, ప్రభుకాంత్ బెజ్జం, రామకృష్ణారెడ్డి చల్ల, యాహు కంపెనీ వాలంటీర్స్ బాధిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి

## - జిల్లా కలెక్టర్ డా. జి.సృజన



ఎన్టీఆర్ జిల్లా,తెలంగాణ ముచ్చట్లు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న అర్జీలకు అధికారులు నాణ్యమైన పరిష్కారాన్ని చూపడం ప్రధానమని.. విస్తృత ప్రజాప్రయోజనాలతో ముడిపడిన ఈ వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు కలెక్టర్ డా. జి.సృజన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సృజన.. పౌర సరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ రజనీకుమారితో కలిసి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్నంగా పరిశీలించి, అర్జీదారుని సమస్యను సరైన విధంగా అర్థం చేసుకొని పరిష్కరించాలని సూచించారు. నిర్దేశ గడువులోగా అర్జీలను పరిష్కరించాలని, పెండింగ్ లేకుండా చూడాలన్నారు. అర్జీల పరిష్కారంపై జిల్లా, మండలస్థాయి అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని, నాణ్యత పెరిగేలా అర్జీదారులకు భరోసా కల్పించేలా పనిచేయాలన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 94 అర్జీలు రాగా వీటిలో రెవెన్యూ-37, పోలీస్-14, ఎంఏయూడీ-14, పంచాయతీరాజ్-6, సర్వే-1, కోఆపరేటివ్-1, ఆరోగ్యం-1, సాంఘిక సంక్షేమం-3, పౌర సరఫరాలు-3, బ్యాంకింగ్-2, మైన్స్ అండ్ జియాలజీ-2, ఏపీఎస్ఆర్టీసీ-1, గ్రామీణ నీటి సరఫరా-1, జాతీయ రహదారులు-1, ఎక్సైజ్-1, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం-1, పాల్గొన్నారు.



# సాహిత్య వేత్త అనిల్ కుమార్ కు గుర్రం జాషువా పురస్కారం

గుడివాడ,తెలంగాణ ముచ్చట్లు : సామాజిక అసమానతలపై కలం జులిపించించిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని మొవ్వ మండల పశు సంవర్ధక ఏ.డి డాక్టర్ ఎం.ఎస్.ఎ దివాకర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక శ్రీనివాసమహల్ సెంటర్ లోని వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గుర్రం జాషువా 129వ జయంతి వేడుకలకు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా దివాకర్ మాట్లాడుతూ జాషువా రచనలు సమాజంలోని మానసిక రుగ్మతలకు అద్దం పడుతూ ప్రతిఒక్కరిని చైతన్య పథం వైపు నడిపించాయన్నారు. ఈ సందర్భంగా పల్నారు జిల్లా మాచర్లకు చెందిన సాహిత్య వేత్త డి. అనిల్ కుమార్ కు గుర్రం జాషువా సాహితీ స్ఫూర్తి పురస్కారం - 2024ను ప్రదానం చేశారు. తొలుత జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోగంటి గాంధీబాబు, చోరగుడి ఇశ్రాయేలు, సమితి సమన్వయ కర్త డి.ఆర్.బి ప్రసాద్, సాహితీ వేత్తలు మోకా మాధవరావు, దుగ్గిరాల ఆనందమోహన్బోసు, చింతలూరి సత్యనారాయణ, చోడవరపు రూప, బండి గోవర్ధనరావు, భూపతి నాగేశ్వరరావు, అవిర్నేని వెంకటేశ్వరావు, ఘంటసాల రామకృష్ణ, పి.వి సత్యనారాయణ, వసుధ బసవేశ్వరరావు, నూలు సాంబశివరావు, ఉరిటి రామారావు, వంగా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రోటరి క్లబ్ యూత్ ఫెస్టివల్ పోటీల్లో గౌతమ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



గుడివాడ,తెలంగాణ ముచ్చట్లు : గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ భవన్లో ఈ నెల 17వ తేదీ నుండి 28వ తేదీ వరకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గౌతమ్ స్కూల్ విద్యార్థులు వ్యాసరచన పోటీలలో 9వ తరగతి విద్యార్థులు ఎల్. గౌరిష్, సి. బృందావని మొదటి స్థానంను, పి.ప్రజ్ఞా మూడవ స్థానం, ఉపన్యాస పోటీల్లో 9వ తరగతి విద్యార్థి వి గోకుల్ నందన్, 10 తరగతి విద్యార్థిని ఎల్. లలిత్ సాయిలు మూడవ స్థానంను సాధించారు. క్విజ్ పోటీలో 9వ తరగతి విద్యార్థి ఎమ్. సాయితరుణ్, 10 వ తరగతి విద్యార్థులు కె.ధృవ, జి.హనిష్, రెండవ స్థానం, స్పెల్-బి పోటీలో 10వ తరగతి విద్యార్థి సి.హెచ్. జస్వంత్ రెండవ స్థానంను కైవసం చేసుకున్నారు. క్లాసికల్ సాంగ్స్ సోలో విభాగంలో 4వ తరగతి విద్యార్థి ఎన్. హిషిక, 10వ తరగతి విద్యార్థి వి.సంకీర్తనలు 2వ రెండవ స్థానంను, జూనియర్ గ్రూప్ సాంగ్ విభాగంలో మొదటి స్థానంను, సీనియర్ విభాగంలో 2వ స్థానంను, అలాగే క్లాసికల్ నృత్య సోలో విభాగంలో 7వ తరగతి విద్యార్థి యు. త్రినయన శ్రీజ మొదటి స్థానంను, 6 వ తరగతి విద్యార్థి ఎల్ పార్వతి రెండవ స్థానంను, 10వ తరగతి విద్యార్థి వై. సాయి ప్రణవి మొదటి కన్సలేషన్ ను, జానపద నృత్య పోటిలో 7 వ తరగతి విద్యార్థి యు. త్రినయన శ్రీజ మొదటి స్థానంను, సబ్ జూనియర్ గ్రూప్ క్లాసికల్ నృత్య పోటిలో 2 వ తరగతి విద్యార్థి జి. తన్మయి, 3వ తరగతి విద్యార్థి కె. సోని కలు మొదటి స్థానంను, జానపద నృత్య పోటీలలో సబ్ జూనియర్ గ్రూప్ విభాగంలో మొదటి స్థానంను, సినియర్ విభాగంలో 8వ తరగతి విద్యార్థులు మొదటి కన్సలేషన్ ను, అలాగే ఫ్యాన్సీ డ్రస్ జూనియర్ విభాగంలో 6 వ తరగతి విద్యార్థి ఎల్ పార్వతి మొదటి స్థానంను 10వ తరగతి విద్యార్థి కె. దేవిప్రియ 3వ స్థానంను, అలాగే స్పాట్ పెయింటింగ్ సీనియర్ విభాగంలో 8వ తరగతి విద్యార్థి జి.శివ శరణ్య మొదటి స్థానంను, 6వ తరగతి విద్యారి ఎల్. పార్వతి, సాదించారు. ఇంతటి ప్రతిభ కనబర్చిన గౌతమ్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులను స్కూల్ ఆవరణలో జరిగిన సభలో స్కూల్ ప్రిన్సిపాల్స్ ఎమ్. సత్యారామ్, పి.లక్ష్మి ప్రసాద్, కె. జ్యోతి ప్రశాంతిఉపాధ్యాయులు అభినందించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU TELTEL12273 తెలుగు దిన పత్రిక



# సినిమా న్యూస్




## ఈ సూపర్ కపుల్.. ఒకే వరలో రెండు కత్తులు!




ఒకే వరలో రెండు కత్తులు ఇమడ్చడం ఎలా? అలా చేస్తే తేడాలొచ్చేందుకు ఆస్కారం ఉంది. కానీ ఎలాంటి తేడా లేకుండా సూపర్ హిట్లు కొడుతూనే జాతీయ అవార్డులు అందుకునే సినిమాలు తీస్తున్నారు జ్యోతిక- సూర్య జంట. 2డి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్‌స్థాపించి అభిరుచి ఉన్న సినిమాలను నిర్మిస్తున్న జంటగా వీరు పాపులరవుతున్నారు. ఇంతకుముందు సురరై పొట్రు (ఆకాశం నీ హద్దురా-తెలుగులో) లాంటి బ్లాక్ బస్టర్ ని తెరకెక్కించారు. ఈ సినిమాకి జాతీయ అవార్డులు రావడం ఒకెత్తు. ఉత్తమ సినిమా- ఉత్తమ నటుడు- ఉత్తమ నటి పురస్కారాలను గెలుచుకుంది ఈ చిత్రం. ఇక ఇదే బ్యానర్ నుంచి ఆల్మోస్ట్ ఆస్కార్ రేసులో నామినేషన్ కి పంపిన జై భీమ్ లాంటి చిత్రం కూడా తెరకెక్కింది. జై భీమ్ బ్లాక్ బస్టర్ చిత్రం. నిజానికి ఎనిమిదేళ్ల విరామం తర్వాత జ్యోతిక %-%36 వయధినిలే%-%తో తిరిగి నటనలోకి వచ్చింది. 2డి ఎంటర్ టైన్ మెంట్ లో రూపొందించిన ఈ సినిమా ఇన్ స్టంట్ హిట్. ఆ తర్వాత దశాబ్ద కాలంగా సూర్య - జ్యోతిక పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. ఇటీవలే ఈ బ్యానర్ నుంచి విడుదలైన సత్యం సుందరం కూడా బలమైన ఎమోషన్స్ ఉన్న సినిమాగా మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. దేవర లాంటి భారీ చిత్రంతో పోటీపడుతూ విడుదలైన ఈ సినిమాకి థియేటర్లలో ఆదరణ దక్కుతోందని సమాచారం. అయితే దశాబ్ద కాలం పాటు కలిసి నటించిన ఈ జంట, మరో దశాబ్ద కాలంగా కలిసి సినిమాలు నిర్మిస్తున్నారు. వీరు మంచి అభిరుచితో తెస్తున్న సినిమాలు ప్రజలకు గొప్ప వినోదం పంచుతున్నాయి. సూపర్ హిట్ లు ఒక వైపు.. అవార్డులు రివార్డులు మరోవైపు.. ఒకే వరలో బాగా ఒదిగాయంటే ఈ జంట అభిరుచి ప్రధాన కారణం. జ్యోతిక- సూర్య దంపతులు కోలీవుడ్ ఆదర్శ జంటగా తమ పిల్లలను గొప్ప స్థాయిలకు ఎదిగేందుకు సాకుతూనే,నటులుగా,నిర్మాతలుగా మంచి పేరు తెచ్చుకుంటున్న వైనం ఔత్సాహిక ఫిలింమేకర్స్, నటీనటులు అందరికీ స్ఫూర్తి.

## మహారాణిగా రీతు వర్మ.. స్వాగ్ చూపిస్తుందా?



క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా కెరియర్ స్టార్ట్ చేసిన తెలుగమ్మాయి రీతు వర్మ 'నా రాకుమారుడు' మూవీతో హీరోయిన్ గా మారింది. తరువాత 'పెళ్లి చూపులు' సినిమాతో హీరోయిన్ గా కమర్షియల్ బ్రేక్ అందుకుంది. అప్పటి నుంచి ఈ బ్యూటీ రెగ్యులర్ గా మూవీస్ చేస్తూ వస్తోంది. తెలుగుతో పాటు, తమిళ్, మలయాళీ భాషలలో కూడా రీతు వర్మ హీరోయిన్ గా రానిస్తోంది. అయితే ఆమె తెలుగులోనే ఎక్కువ సినిమాలు చేసింది. గ్లామర్ రోల్స్ చేయకపోయిన కూడా రీతు వర్మ హీరోయిన్ గా తనదైన ముద్ర వేసుకుంది. ఆమె చివరిగా గత ఏడాది 'మార్క్ ఆంటోనీ' సినిమాలో విశాల్ కి జోడీగా నటించింది. తెలుగులో చిన్న హీరోల నుంచి మీడియం రేంజ్ స్టార్స్ వరకు అందరితో రీతు వర్మ మూవీస్ చేస్తోంది. శర్వానంద్, నాని, నాగశౌర్య లాంటి స్టార్స్ తో కూడా జతకట్టింది. ఇదిలా ఉంటే ఆమె శ్రీవిష్ణుకి జోడిగా నటించిన 'స్వాగ్' మూవీ అక్టోబర్ 4న ఈ మూవీ రిలీజ్ కాబోతోంది. హసత్ గోలీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ డిఫరెంట్ కాన్సెప్ట్ తో రెండు టైం లైన్స్ లో ఉండబోతోంది. ఈ సినిమాలో రీతు వర్మ రెండు వేరియేషన్స్ ఉన్న క్యారెక్టర్ లో నటిస్తోంది. అందులో స్త్రీస్వామ్య పాలన చేసే వింజామర వంశ మహారాణి రుక్మిణీ దేవి పాత్ర ఒకటి. పురుషాధిక్యంపై ధిక్కార స్వరం వినిపించే క్యారెక్టరైజేషన్ తో రీతు వర్మ పాత్ర ఉండబోతోందని తెలుస్తోంది. ఆమె కెరియర్ లో చేస్తోన్న చాలా బలమైన క్యారెక్టర్స్ లలో ఇది ఒకటనే మాట వినిపిస్తోంది. స్వాగ్ మూవీలో రీతు వర్మ క్యారెక్టర్ హైలైట్ అవుతుందని మేకర్స్ చెబుతున్నారు.

## విశ్వక్ మెకానిక్ రాకీ.. కాస్త ఆలస్యంగానే..



యంగ్ టాలెంటెడ్ హీరో విశ్వక్ సేన్ నటించిన 'మెకానిక్ రాకీ' మూవీ షూటింగ్ కంప్లీట్ చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. రవితేజ ముళ్ళపూడి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రామ్ తాళ్ళూరి ఈ సినిమాని నిర్మించారు. కమర్షియల్ ఎంటర్టైనర్ గా సిద్ధమవుతోన్న ఈ సినిమాలో విశ్వక్ సేన్ కి జోడీగా మీనాక్షి చౌదరి నటించింది. విశ్వక్ సేన్ నుంచి ఈ ఏడాది రాబోయే మూడో సినిమా 'మెకానిక్ రాకీ' కావడం విశేషం. భారీ బడ్జెట్ తో ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. నిజానికి దీపావళి కానుక అక్టోబర్ 31న 'మెకానిక్ రాకీ' చిత్రాన్ని రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ గతంలో ప్రకటించారు. అయితే ఇప్పుడు రిలీజ్ డేట్ వాయిదా పడినట్లు టాక్ వినిపిస్తోంది. కచ్చితంగా ఈ సినిమాతో కమర్షియల్ బ్లాక్ బస్టర్ అందుకుంటాననే కాన్ఫిడెన్స్ తో విశ్వక్ సేన్ ఉన్నారు. మూవీ ప్రమోషన్స్ కూడా స్టార్ట్ చేశారు. అయితే ఈ చిత్రానికి పోటీగా దుల్కర్ సల్మాన్ 'లక్కీ భాస్కర్' మూవీని రిలీజ్ చేయబోతున్నారు. పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా ఈ మూవీ తెరకెక్కుతోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రెడీ అవుతోన్న ఈ సినిమాని సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకొచ్చిన టీజర్, సాంగ్ ఆకట్టుకున్నాయి. కాన్సెప్ట్ ఏదో ఇంటరెస్టింగ్ గా ఉందనే అభిప్రాయం పబ్లిక్ లోకి వెళ్ళింది. 'లక్కీ భాస్కర్', 'మెకానిక్ రాకీ' సినిమాలు రెండు మీడియం రేంజ్ మూవీస్ గానే వస్తున్నాయి. దీపావళి రేసులో ఈ రెండు ప్రేక్షకుల ముందుకొచ్చిన పెద్ద నష్టమేమీ ఉండదు. అయితే 'మెకానిక్ రాకీ' మూవీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉండటంతో రిలీజ్ డేట్ ని వాయిదా వేసినట్లు ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది. రీసెంట్ గా ఈ మూవీ నుంచి విశ్వక్ సేన్ పోస్టర్ ఒకటి రిలీజ్ చేశారు. ఇందులో రిలీజ్ డేట్ ని మేకర్స్ తొలగించారు. దీంతో మూవీ వాయిదా పడటం గ్యారెంటీ అనే మాట బలంగా వినిపిస్తోంది. త్వరలో రిలీజ్ డేట్ ని మళ్ళీ ఎనౌన్స్ చేస్తారని అంటున్నారు. నవంబర్ 7న మేగ్జిమమ్ ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చే ఛాన్స్ ఉండొచ్చనే టాక్ నడుస్తోంది. ఏది ఏమైనా 'మెకానిక్ రాకీ' సినిమాతో మంచి కమర్షియల్ సక్సెస్ అందుకోవాలని కసితో విశ్వక్ సేన్ ఉన్నారు.

## రాజమౌళి, త్రివిక్రమ్.. పూజ ఛాయిస్ కు కారణమేంటో?



స్టార్ హీరోయిన్ పూజా హెగ్డేకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. ఒకప్పుడు వరుస సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా గడిపిన అమ్మడు.. ఇప్పుడు అడపాదడపా చిత్రాల్లో యాక్ట్ చేస్తోంది. మంచి హిట్ అందుకుని రెండేళ్లు దాటిపోయింది. గతేడాది కిసీ కా భాయ్ కిసీ కీ జాన్ సినిమాతో సరిపెట్టుకున్న పూజ.. ఇప్పుడు మళ్లీ బిజీ అవ్వడానికి ట్రై చేస్తోంది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో సూర్యతో పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ గా రానున్న పాన్ ఇండియా మూవీలో నటిస్తోంది. లవ్ అండ్ వార్ నేపథ్యంలో రూపొందుతున్న సూర్య44కు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. సినిమాలో సూర్య గ్యాంగ్ స్టర్ గా కనిపించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ ప్రాజెక్ట్ కు గాను తన షూటింగ్ పార్ట్ ను రీసెంట్ గా పూజ కంప్లీట్ చేసుకుంది. ఆ విషయాన్ని ఆమెనే తెలిపింది. దీంతోపాటు బాలీవుడ్ షాహిద్ కపూర్ తో యాక్షన్ మూవీ దేవా చేస్తోంది పూజా హెగ్డే. కాంచన-4 మూవీలో కూడా ఆమె నటించనున్నట్లు కొద్ది రోజులుగా ఇండస్ట్రీలో వార్తలు వినిపిస్తున్నాయి. ఇదంతా పక్కన పెడితే.. రీసెంట్ గా అబుదాబిలో ఐఫా అవార్డుల వేడుక జరిగిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమంలో పాల్గొన్న పూజ మీడియాతో మాట్లాడింది. రాజమౌళి, త్రివిక్రమ్ మూవీస్ లో ఒకేసారి సినిమా చేసే ఛాన్స్ వస్తే.. ఎవరి ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇస్తారని అడిగిన ప్రశ్నకు రాజమౌళి పేరు చెప్పింది పూజ. ఇద్దరూ తనకు ఫేవరేట్ అన్న అమ్మడు.. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా రాజమౌళితో వర్క్ చేయలేదని, అందుకే ఆయన పేరు చెప్పానని తెలిపింది. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారాయి.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.“PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,“CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in